ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 1 ఆగస్టు 2024

'ఓపెన్' డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం


కులకచర్ల, జూలై 31 : బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కులకచర్ల శ్రీ రామలింగేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి, స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. అభ్యర్థులు ఆగస్టు 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9441679846 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి విజిట్

ఉమ్మడి జిల్లాలో విష జ్వరాలు కుదిపేస్తున్నాయి. ముసురు వర్షాలతో వాతావరణంలో నెలకొన్న మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయి. పిల్లలు, పెద్దలు జ్వరాలతో వణికి పోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ, టైఫాయిడ్, తదితర విష జ్వరాలతో జనం ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. వర్షాలు పడుతున్నాయన్న సంబరం కంటే జ్వరాలు సోకుతున్నాయనే ఆందోళనే ఎక్కువైంది. జలుబు, దగ్గు, తీవ్ర జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద జనం క్యూ కడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పితో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు తీవ్ర జ్వరం, కఫంతో ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతూ ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్‌లుగా చేరి రోజుల తరబడి చికిత్సలు పొందుతున్న తీరు 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగు చూశాయి.


పరిగి: గైనకాలజీ ఓపీలో మహిళల క్యూ

జ్వరాల.. పంజా!



ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న జ్వర పీడితులు

- దగ్గు, జ్వరం, జలుబుతో సతమతం
- రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- భయపెడుతున్న డెంగీ, టైఫాయిడ్, డయేరియా
- ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న జనం

భారీగా పెరిగిన ఓపీ..

సాధారణంగా నిత్యం సగటున 100-200 ఓపీ కేసులు వస్తుంటాయి. కానీ.. వారం రోజుల నుంచి సగటున 200-300 వరకు వస్తున్నాయి. ఇందులో 80శాతం విష జ్వరాలు, డెంగీ సంబంధిత కేసులే ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందక పోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. నిత్యం వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి రోజూ 400 నుంచి 500 మంది వరకు ఓపీ రోగులు వస్తుంటారు. కాగా, 15 రోజులుగా ఆ సంఖ్య వెయ్యికి వరకు పెరిగింది. షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో ఓపీ సంఖ్య 200 నుంచి 300కు పెరిగింది. ఇబ్రహీంపట్నంలోని రోజుకు 200 మంది వరకు ఓపీ చూస్తున్నారు. సాధారణ రోజుల కంటే 20 శాతం ఓపీ పెరిగింది. చేవెళ్ల, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సంఖ్య గణనీయంగా పెరిగింది. దారూరులో వారం రోజుల్లోనే ఇక్కడ 10 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి.

రంగారెడ్డిలో డెంగీ కేసులు (2024 జనవరి నుంచి జూలై 30 వరకు)	
గ్రామీణ ప్రాంతాల్లో	:04
మున్సిపాలిటీల్లో	:11
జీహెచ్ఎంసీలో	:42
మృతులు	:01
మొత్తం	:58

వికారాబాద్ జిల్లాలో జ్వరం కేసులు

నెల	డెంగీ	టైఫాయిడ్
జనవరి	01	00
ఫిబ్రవరి	01	04
మార్చి	02	05
ఏప్రిల్	01	06
మే	03	13
జూన్	07	22
జూలై	14	21
మొత్తం	29	71

ఆసుపత్రుల్లో.. అపరిశుభ్రత

పరిగి ఆసుపత్రిలోని మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉండడంతో రోగులు ఇక్కట్లు పడుతున్నారు. తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మెయిన్ గేట్ లోనే దుర్వాసనతో కూడిన అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. రోగాలకు చికిత్స లభించాల్సిన చోటనే అపరిశుభ్రతగా ఉండడంతో రోగులకు వ్యాధులు తగ్గక పోగా, కొత్త రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.


కొడంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

భయపెడుతున్న డెంగీ

ఉమ్మడి జిల్లాలో డెంగీ భయపెడుతుంది. ఒక్కసారిగా కేసులు పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లోనే ఈ కేసులు నమోదు ఎక్కువగా ఉన్నాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో మొత్తం 55 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా లెక్కలోకి రాకుండా ఉన్న కేసుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. చేవెళ్ల మండలం చెన్‌వెల్లిలో ఒకే ఇంట్లో అన్నతమ్ముడికి డెంగీ జ్వరం సోకింది. చేవెళ్ల మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. వారిలో మణీశ్వర్ (11) చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమ్ముడు వర్షిత్ డెంగీ నుంచి కోలుకున్నాడు. ఫరూక్‌నగర్‌కు చెందిన ఫరహానా బేగం డెంగీతో ఇన్‌పేషెంట్‌గా చేరింది. వికారాబాద్ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఇద్దరికి డెంగీ పాజిటివ్ రాగా వారికి అదే ఆసుపత్రిలోనే వైద్యం అందిస్తున్నారు. మర్పల్లిలో నలుగురికి డెంగీ సోకింది. యాచారంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 210 మందికి ఓపీ చూశారు. ఎక్కువగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న రోగులే అధికంగా ఉన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత వైద్యులు ఎవరూ ఉండటం లేదు. దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.


మేడ్చల్ ప్రభుత్వాసుపత్రిలో ఓపీ విభాగం

(ఆంధ్రజ్యోతి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జ్వరాల తీవ్రత పెరిగింది. డెంగీ, టైఫాయిడ్‌తో ఎక్కువమంది ఆసుపత్రుల పాలవుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ముందుగా అప్రమత్తం కాకపోవడం, స్థానిక సంస్థల్లో దోమల నివారణ చేపట్టక పోవడంతో జ్వరాలు బాగా పెరిగాయి. రంగారెడ్డి జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 8,871 మందికి జ్వరాలు సోకినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వికారాబాద్ జిల్లాలో డెంగీ 29, టైఫాయిడ్ 71 కేసులు నమోదయ్యాయి. జ్వర పీడితుల్లో పిల్లలు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మర్పల్లి ప్రభుత్వాసుపత్రిలో నెల రోజుల్లో 200 మంది వాంతులు, విరేచనాలతో చికిత్స కోసం వచ్చారు. వారిలో 35 మంది టైఫాయిడ్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందారు. మర్పల్లి, బూచన్‌పల్లి, గుర్రంగట్టుతండా, కురుగుంట గ్రామాల నుంచి జ్వరాలతో బాధపడుతున్న రోగులు వైద్యం కోసం ఆసుపత్రికి వస్తున్నారు. శంషాబాద్, మహేశ్వరం ఆసుపత్రుల్లో విష జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. మహేశ్వరంలో డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కొందుర్గు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఓపీ ఎక్కువగా నమోదవుతుంది. గొంతునొప్పి, దగ్గు, జలుబులతో రోగులు వస్తున్నారు. చౌదరిగూడ పీహెచ్‌సీ ఉపకేంద్రానికి జలుబు, దగ్గు, మోకాళ్ల నొప్పులు, లివర్ సమస్యతో ఎక్కువగా వస్తున్నారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో అధికంగా టైఫాయిడ్, మలేరియా, అతిసారతో ఇబ్బందులు పడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇది వరకు జ్వరాల వార్డుల్లో పడకలు ఖాళీగా ఉండేవి. ప్రస్తుతం ఆసుపత్రుల్లోని జ్వరాల వార్డుల్లో పడకలు ఖాళీగా లేకుండా

మిగతా 7వ పేజీలో...


ఆమనగల్లు ఆస్పత్రికి వచ్చిన వృద్ధులు, గిరిజనులు

రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై 30 వరకు నమోదైన వ్యాధుల వివరాలు

వ్యాధులు	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జూలై	మొత్తం
డయేరియా	91	86	68	83	116	116	96	602
జ్వరాలు	1,462	1,351	1,405	1,270	1,159	1,132	1,092	8,871
తీవ్రమైన శ్వాసకోస	74	28	08	06	08	04	07	133
స్వైన్‌ఫ్లూ	00	00	00	00	01	00	01	02


యాచారంలోని పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చిన రోగులు

వైద్య సిబ్బంది కొరతతో ఇబ్బందులు..

రంగారెడ్డి జిల్లా కొందుర్గు ఆసుపత్రిలో ప్రస్తుతం ఒకే డాక్టర్ విధులు నిర్వహిస్తున్నాడు. ఇద్దరు స్టాఫ్ నర్సులకు గాను ఒక్కరు కూడా లేరు. ఫస్ట్ ఏఎన్ఎంలు కూడా లేరు. కొత్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరికి ఒక డాక్టరే ఉన్నారు. షాబాద్ మండలం చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టరే లేరు. ప్రస్తుతం ఇక్కడ డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొయినాబాద్ పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేరు. దీంతో రక్త పరీక్షలకు ప్రైవేట్ డయోగ్నస్టిక్ సెంటర్లకు వెళుతున్నారు. చేవెళ్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మొత్తం పది మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఐదుగురు వైద్యులు మాత్రమే ఉన్నారు. పూడూరు పీహెచ్‌సీలో కూడా డాక్టర్లు, సిబ్బంది నిధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నారని రోగులు చెబుతున్నారు. కులకచర్ల పీహెచ్‌సీ ఇద్దరు డాక్టర్లకు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మోమిన్‌పేట్ ప్రభుత్వాసుపత్రిలో ఒకే వైద్యురాలు విధులు నిర్వహిస్తున్నారు. తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత నెలకొంది.

కురుస్తున్న వర్షాలు.. లోపించిన పారిశుధ్యం

వర్షాలు కురుస్తుండటంతో పారిశుధ్యం లోపించింది. దోమల ఉధృతి పెరిగింది. దీంతో అదునుగా కాచుకుని కూర్చున్న సీజనల్ వైరస్‌లు తిరిగి విజృంభిస్తున్నాయి. జలుబు, ముక్కు నుంచి నీరు కారడం, దగ్గు, జ్వరం వంటివి వేదిస్తున్నాయి. పట్టణాల్లో మురుగు కాల్వలను సరిగా శుభ్రం చేయక పోవడంతో దోమలు పెరుగుతున్నాయి. గ్రామాల్లో మురుగు కాల్వల నిర్మాణాలు సరిగా లేవు. ఎక్కడ పడితే అక్కడ మురుగు నీరు నిలుస్తోంది. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాల్సి ఉండగా ఇది ఎక్కడా అమలు కావడం లేదు.



మందుల కొరత

పరిగి ఆసుపత్రిలో మందుల కొరత కారణంగా బయటకు రాస్తున్నారు. కులకచర్ల ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉంది. రెండు నెలలుగా మందల సరఫరా కావడం లేదు. రెండు రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వికారాబాద్ ఆసుపత్రిలో అత్యవసర మందులు అందుబాటులో లేవు. దీంతో వైద్యులు బయట మార్కెట్ నుంచి వాటిని తెప్పించి వాడుతున్నారు. తాండూరు అంబులెన్స్ ఉన్నా.. షెడ్డుకే పరిమితమైంది.


మొయినాబాద్ పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న ఆయుష్ డాక్టర్ కుర్చీ

రంగారెడ్డి జిల్లాలో నాలుగేళ్లుగా నమోదైన వ్యాధులు

సంవత్సరం	డయేరియా	జ్వరం	శ్వాసకోస	స్వైన్‌ఫ్లూ
2021	803	4,573	1,003	108
2022	05	15,345	09	04
2023	1,264	17,552	826	79
2024	602	1,092	133	02
మొత్తం	2,674	38,562	1,971	193

పేదలకు పథకాలు అందేలా చూడాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 31 : అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీలలో చేపడుతున్న భవనాల పురోగతి, ఉపాధి హామీ పనులు, పారిశుధ్యం తదితర అంశాలపై ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి ద్వారా విద్యుత్తు సున్నా బిల్లుకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, లబ్ధి పొందుతున్న సంఖ్య ఎంత అనే వాటిపై దృష్టి సారించి వాటిని లబ్ధిదారులకు పొందలేని పక్షంలో సాంకేతిక లోపాలను సరిచేసి వారం రోజుల్లో అర్హులకు పథకాలు వర్తించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు సిబ్బందికి మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆగస్టు 20 లోపు అంగన్‌వాడీలలో చేపడుతున్న మరమ్మత్తులు, పెయింటింగ్ పనులను పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీలలో అసంపూర్తిగా ఉన్న వివిధ భవన నిర్మాణ పనుల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టి పూర్తి చేసిన పనుల వివరాలతో పాటు పనులు చేపట్టక ముందు, పూర్తి అయిన తర్వాత తీసిన ఫొటోలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ భూములను యుద్ధ ప్రాతిపదికన చదును చేసే విధంగా పనులను చేపట్టాలన్నారు. జిల్లాలో 37 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల ప్రహరీల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి చెల్లింపులపై ఆరా తీశారు. పనులు పూర్తయినప్పటికీ చెల్లింపులో జాప్యం ఎందుకని సంబంధిత ఇంజనీర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయిన వాటికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్ డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, సీపీఓ అశోక్‌కుమార్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో వెంకటేశ్వరమ్మ, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, డీఎల్పీవోలు సంధ్యారాణి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఫీజులకు ఎగనామం!

- అక్రమ నిర్మాణాలతో ఆదాయానికి గండి!
- గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీలో అడ్డగోలు వ్యవహారాలు
- అధికారులు, కౌన్సిలర్ల చేతివాటం

మేడ్చల్ టౌన్, జూలై 31 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతి లేని నిర్మాణాలతో ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. అక్రమ నిర్మాణాలపై నిఘా పెట్టాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తుండడంతో నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుంటుండడంతో ఈ వ్యవహారం మూడు పువ్వులు ఆరు కాయల్లా సాగుతోంది. మున్సిపాలిటీ పరిధి భూములు ఆర్-1, హైరేంజ్ జోన్‌లో ఉన్నాయి. దీనికి తోడు కొన్ని భూములు కమర్షియల్ జోన్ కింద ఉన్నాయి. ఇక్కడ తరచూ పెద్దఎత్తున బహుళ అంతస్తులు, రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలు, సరుకులు నిల్వచేసే గోదాముల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. 'అక్రమ నిర్మాణాలను అరికట్టండి మహాప్రభో' అంటూ ప్రజలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. అక్రమ నిర్మాణాలతో అనుమతి కింద చేకూరాల్సిన ఆదాయం రాక మునిసిపాలిటీకి నిధుల కొరత ఏర్పడుతోంది. నగర శివారులో ఉన్న గుండ్లపోచంపల్లిలో గత పదేళ్లలో నిర్మాణ రంగం పెద్ద ఎత్తున అభివృద్ధి చెందింది. ఆర్-1, హైరేంజ్ జోన్ భూములు ఉన్నందున ఇక్కడ నిత్యం బహుళ అంతస్తులు వెలుస్తున్నాయి. కొత్త వెంచర్లూ బాగానే ఏర్పాటవుతున్నాయి. చేపడుతున్న నిర్మాణాలకు కొందరు హెచ్‌ఎండీఏ అనుమతులు పొందుతున్నా అనుమతులకు విరుద్ధంగా కట్టడాలు చేపడుతున్నారు. ఇలాంటి నిర్మాణాలను నియంత్రించాల్సిన మున్సిపల్ అధికారులు చేతివాటానికి అలవాటు పడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.


మేడ్చల్ ఐదో వార్డులో అనుమతి లేకుండా నిర్మిస్తున్న గోదాం

రూ.కోట్లలో ఆదాయానికి గండి

అక్రమ నిర్మాణాలతో మునిసిపాలిటీకి రావాల్సిన ఆదాయం రావడం లేదు. బహుళ అంతస్తులు, గోదాములు నిర్మించే వారు మొదట హెచ్‌ఎండీఏకు దరఖాస్తు చేయాలి. అనంతరం నిర్మాణాలకు సంబంధించిన వివరాలతో హెచ్‌ఎండీఏ తగిన ఫీజును ఖరారు చూస్తూ అనుమతులిస్తుంది. అనంతరం మున్సిపల్ కార్యాలయం హెచ్‌ఎండీఏ అనుమతుల ఆధారంగా ఫీజు వసూలు చేసి నిర్మాణాలకు అనుమతిలిస్తారు. దీంతో మున్సిపాలిటీకి కోట్లలో ఆదాయం సమకూరుతుంది. అయితే ఫీజు ఎగ్గొట్టి లక్షల్లో అధికారులకు ముడుపులు సమర్పించుకుని కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణాల అనంతరం మున్సిపల్ అధికారులకు చేతులు తడిపి అసెస్మెంట్ చేయించుకొని నామ్‌కే వాస్తే ఫీజు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకుంటున్నారు. దీంతో న్యాయబద్ధంగా మున్సిపాలిటీకి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయానికి గండి పడుతోంది.


రోడ్డు పక్కన నిర్మిస్తున్న షట్టర్లు

ముడుపులు ముట్టనంత వరకే నాయకుల హల్‌చల్!

అక్రమ నిర్మాణాలకు గుండ్లపోచంపల్లి కేరాఫ్ అడ్రెస్‌గా మారింది. మునిసిపాలిటీ కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతోందన్న విషయం కౌన్సిల్ ప్రజాప్రతినిధులకు తెలిసినా వారు మౌనంగా ఉండటం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలు ప్రజాప్రతినిధుల అండదండలతోనే చేపడుతున్నారన్న ఆరోపణలూ వస్తున్నాయి. కొందరు కౌన్సిలర్లు అక్రమ నిర్మాణదారులకు అండగా ఉండడంవల్లే తాము నియంత్రించలేకపోతున్నాం అని ఓ అధికారి అనడం గమనార్హం. అక్రమ కట్టడాలు చేపట్టే వారి వద్ద నుంచి మామూళ్లు రానంత వరకు కౌన్సిలర్లు గగ్గోలు పెట్టడం.. ముడుపులు ముట్టిన తర్వాత కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరించటం ఇక్కడ షరా మామూలుగా మారిందని స్థానికులంటున్నారు.



అనుమతి లేకుండా రిసార్ట్స్‌లో మద్యం వినియోగించొద్దు

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలహాసన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 31: ఫంక్షన్ హాళ్లు, రిసార్టుల్లో నిర్వహించే బర్త్‌డే పార్టీలు, ఇతర శుభకార్యాల్లో మద్యం వినియోగిస్తే తప్పనిసరిగా ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ.కమల్‌హాసన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన 'రిసార్ట్స్‌పై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు' వార్తకు ఆయన స్పందించారు. మేడ్చల్ జిల్లాలోని అంకుషాపూర్‌లోని ది కాంటినెంటల్ రిసార్ట్స్‌లో సోమవారం అర్ధరాత్రి బిగ్ బాస్ ఫేమ్ మహబూబ్ ఇచ్చిన బర్త్‌డే పార్టీలో టీవీ నటులు, సెలబ్రెటీలు పాల్గొని అనుమతి లేకుండా మద్యం వినియోగించిన విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మహబూబ్ బర్త్‌డే వేడుకలో 20మంది టీవీ నటులు, పలువురు వీఐపీలు పాల్గొన్నారని తెలిపారు. ఈ వేడుకలో అనుమతి లేకుండా మద్యం వినియోగించిన రిసార్ట్ యజమాని సుధీర్, నిర్వాహకుడు షేక్ సుభానిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రిసార్ట్‌లు, ఫాంహౌస్‌లలో శుభకార్యాలు చేసేవారు మద్యం వినియోగిస్తే ఎక్సైజ్ శాఖ నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కమల్‌హాసన్‌రెడ్డి హెచ్చరించారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మేడ్చల్ జూలై 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ కళాశాలలు, గురుకుల హాస్టల్స్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. గురుకుల హాస్టల్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అద్దె భవనాల్లోని హాస్టల్స్ విద్యార్థులకు కాస్మోటిక్స్, దుప్పట్లు, గిన్నెలు, గ్లాసులు, కంప్యూటర్స్, ఆట వస్తువులు ఇవ్వాలన్నారు. ఒక్కో వార్డెన్ రెండు నుంచి మూడు హాస్టళ్ల ఇన్‌చార్జిలుగా ఉన్నారని, ఖాళీగా ఉన్న వార్డెన్ వర్కర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో శ్యాంరావు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి



రొంపల్లి గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న బక్కని నర్సింహులు

వికారాబాద్, జూలై 31: తెలంగాణ రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ పునర్నిర్మాణమే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త, నాయకుడు కష్టపడాలని పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. బుధవారం వికారాబాద్‌లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు ఉపాధి కల్పించారన్నారు. ఎంతో మంది నాయకులు ఎన్నో ప్రయోజనాలు పొంది, పదవులు అనుభవించి పార్టీ మారినా, కార్యకర్తలు పార్టీకి వెన్నెముకగా నిలిచారన్నారు. త్వరలో జరగబోయే సభ్యత్వ నమోదులో గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తామన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడుతున్న రొంపల్లి గ్రామ అధ్యక్షుడు నరసింహారెడ్డిని నర్సింహులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉప్పరి ప్రసాద్, పండు, బంతారాం నర్సింలు, జంగయ్య, జకిల్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల.. పంజా!

(ఐదో పేజీ తరువాయి)



వికారాబాద్ ప్రభుత్వాసుపత్రిలో నిండిపోయిన బాలింతలు, రోగులు

జ్వర పీడితులతో నిండిపోతున్నాయి. మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్‌లలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీ (అవుట్ పేషెంట్) విభాగంలో ఇదివరకైతే ప్రతి రోజు 500 నుండి 700 వరకు బయటి పేషంట్లుగా చికిత్సలు పొందేవారు. ప్రస్తుతం ఓపీలో చికిత్సలకు వచ్చే వారి సంఖ్య వెయ్యికి పైగా పెరిగింది. మంగళవారాల్లో నేతే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటున్నదని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి.

సమయానికి రాని డాక్టర్లు

పరిగి కమ్యూనిటీహెల్త్ సెంటర్‌లో సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వ్యక్తమవుతోంది. ఈ ఆసుపత్రిలో పది మంది డాక్టర్లకు మంగళవారం ఐదుగురే విధులకు హాజరయ్యారు. పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 113 మంది రోగులు వచ్చారు. డాక్టర్ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు డాక్టర్ ఓపీ చూసుకుని వెళ్లిపోయారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నుండి ఫోన్ వచ్చిందంటూ డాక్టర్ అక్కడకు వెళ్లారు. ఆ తర్వాత వచ్చిన రోగులకు ఏఎన్‌ఎంలు, అటెండర్లే బీపీ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి పంపించారు. పరిగి ఆసుపత్రి వైద్యులు ఉదయం 9 గంటలకు రావాల్సిన డాక్టర్లు 11గంటలకు వచ్చారు. అప్పటి వరకు వచ్చిన రోగులకు ఫార్మసిస్ట్ చికిత్స అందించి పంపించారు. మొయినాబాద్ ఆయుష్ క్లినిక్ అధికారులు అందుబాటులో లేరు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

నాకు, నా భార్యకు వాంతులు, విరేచనాలు కావడంతో దోమ పీహెచ్‌సీకి వెళ్లాం. అక్కడ ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాం. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మందులు కూడా లేవని చెబుతున్నారు.

- అటికే హన్మయ్య, రోగి, బాసుపల్లి ,దోమ మండలం

డాక్టర్లు విసుక్కుంటున్నారు

చేవెళ్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సరైన వైద్యం అందడం లేదు. వైద్యం కోసం వెళితే విసుక్కుంటున్నారు. డాక్టర్స్ వచ్చి ఒకరిద్దరిని చూసి గదిలోకి వెళుతున్నారు. డాక్టర్ లేని సమయంలలో నర్సులే రోగానికి తగ్గట్టుగా ఇంజక్షన్ చేస్తున్నారు. బీపీ టాబ్లెట్స్ అందుబాటులో ఉండటం లేవు. రెండు నెలలుగా ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నాను. 5 ఎంజీ టాబ్లెట్ అవసరం అయితే.. 2.5 ఎంపీ టాబ్లెట్ ఇచ్చి పంపారు.

- విఠలయ్య, చేవెళ్ల గ్రామం

మెరుగైన సేవలు అందిస్తున్నాం.



పరిగి ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు బాగానే అందిస్తున్నాం. మందుల కొరత ఏమీ లేదు. రోగులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నాం. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారు. ఇక్కడ నార్మల్; సీజేరియన్ ప్రసవాలు కూడా చేస్తున్నారు. ప్రమాదకరంగా, అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఇతర ఆసుపత్రులకు సిఫారసు చేయడం లేదు.

- డాక్టర్ రాజశేఖర్, పరిగి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం

ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో జ్వరాలు పెరిగే అవకాశాలుంటాయి. ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా అవగాహన కార్యక్రమాలు, డ్రైడే... ఫ్రైడే చేపడుతున్నాం. జ్వర సర్వే సైతం ప్రారంభించాం. ప్రతి పీహెచ్‌సీలో అనునిత్యం వైద్య శిబిరాలను కొనసాగిస్తున్నాం.

- రఘునాథస్వామి, జిల్లా వైద్యాధికారి



కొడంగల్: సీజనల్ వ్యాధుల కారణంగా ప్రభుత్వాసుపత్రిలో క్యూలో నిలిచిన రోగులు



పెద్దేముల్ పీహెచ్‌సీలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఏఎన్‌ఎంలు



సమావేశంలో మాట్లాడుతున్న బద్యానాథ్ చౌహాన్

సారా తయారీ, సామగ్రిని విక్రయిస్తే కఠిన చర్యలు

ఆమనగల్లు, జూలై 31: నాటుసారా తయారీ, సామగ్రిని విక్రయించొద్దని, ప్రభుత్వం నాటుసారా నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటుందని ఆమనగల్లు ఎక్సైజ్‌సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఆమనగల్లు ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం వ్యాపారస్తులు, కిరాణ దుకాణ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సారా రహిత తెలంగాణగా రాష్ట్రాన్ని నిలుపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సారా ను అరికట్టడానికి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున దాడులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారులు నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం, నవసాగ్రహం, పటిక, ఇప్పపువ్వు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. దుకాణాలలో అట్టి వస్తువులు నిల్వ ఉంచితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై కూడా నిఘా ఉంచినట్లు తెలిపారు. ఇటీవల పలువురిని ఆమనగల్లు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కండె పాండు రంగయ్య, రామ్మోహన్, లక్ష్మయ్య, సురేశ్, రవి, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

షాబాద్, జూలై 31 : సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండలం చిన్నసోలిపేట్ గ్రామానికి చెందిన చరిత వైద్య ఖర్చుల చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2లక్షల 50వేల సీఎంఆర్ ఎఫ్ ఎల్వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో మేడ్చల్ విద్యార్థి ప్రతిభ



ఆదిత్యయాదవ్

మేడ్చల్ టౌన్, జూలై 31: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో మేడ్చల్‌లోని న్యూ లిటిల్ లిల్లీ పాఠశాల విద్యార్థి బౌలింగ్‌లో ప్రతిభను చూపాడు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఏ-2 డివిజన్ లీగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థి ఆదిత్యయాదవ్ విజయనగర్ టీం తరఫున అద్భుతంగా బౌలింగ్ చేసి ఆరు వికెట్లు పడగొట్టి జట్టు విజయానికి కృషిచేశాడు. ఆదిత్యను క్రికెట్ కోచ్‌లు మన్సూర్, బుచ్చిబాబు, ప్రశాంత్ ఉపాధ్యాయులు అభినందించారు.

చింతకుంటపల్లి రెవెన్యూ నక్ష సమస్యను ప్రభుత్వం పరిశీలించాలి

శాసన మండలిలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

కేశంపేట, జూలై 31: మండలంలోని చింతకుంటపల్లి గ్రామ రెవెన్యూ నక్ష (మ్యాప్) సమస్యను ప్రభుత్వం పరిశీలించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి కోరారు. బుధవారం శాసన మండలి సమావేశంలో చింతకుంటపల్లి గ్రామ సమస్యను ఎమ్మెల్సీ ప్రస్తావించారు. గ్రామానికి మ్యాప్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మ్యాప్‌లేక పోవడంతో సరిహద్దు పంచాయతీలు పెరిగిపోయాయని, గ్రామ నక్ష సమస్యను పరిష్కరించాలని కోరారు. కాగా, తమ గ్రామ సమస్యను శాసన మండలిలో ప్రస్తావించినందుకు గ్రామస్తులు రమేష్ యాదవ్, శ్రీనివాస్, పారేశ్ యాదవ్, మల్లేష్ యాదవ్ తదితరులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. త్వరగా నక్ష సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు కోరారు.

ఉచిత విద్య, వైద్యం అందించాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వర్లు
- ముగిసిన సీపీఎం శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న మిరియం వెంకటేశ్వర్లు

నందిగామ, జూలై 31: దేశంలో ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వాలు ఉచిత విద్య, వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వర్లు కోరారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా శిక్షణా తరగతుల్లో భాగంగా చివరిరోజు బుధవారం నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి శివారులో గల కాకా గెస్ట్‌హౌస్‌లో జరిగిన కార్యక్రమానికి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పైసలు ఉంటేనే ప్రైవేటు వైద్యం, విద్య దొరుకుతుందని, అవి నేడు సామాన్య ప్రజలకు అందని ద్రాక్షలా మారాయన్నారు. ప్రభుత్వాలు ధనిక దేశాలను ఆదర్శంగా తీసుకుని.. అవి అమలు చేస్తున్న విధానాలను మన దేశంలో అమలు చేయాలన్నారు. భారత్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలకు ప్రజలు సహకరించాలని కోరారు. మూడు రోజులుగా జరిగిన శిక్షణ తరగతులు బుధవారం ముగిసాయి. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, భాస్కర్, రాజు, సామ్యేల్, చంద్రమోహన్, జగదీష్, యాదయ్య, శోభన్, కవిత, నర్సిరెడ్డి, కొంగరి నర్సింలు, పద్మారెడ్డి, దేవేందర్ రుద్ర, యాదగిరి, రాంచందర్, అంజయ్య, శ్రీను నాయక్, ఈశ్వర్, కుర్మయ్య, వెంకటరమణ, మహమ్మద్ బాబు, లక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సందీప్ శాండిల్య

దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

శంకర్‌పల్లి, జూలై 31: ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్, అదనపు డీజీపీ సందీప్ శాండిల్య తెలిపారు. కొండాకల్ గ్రామంలోని ఇండస్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో బుధవారం మత్తు పదార్థాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. మత్తు పదార్థాలను అలవాటు చేసుకుంటే జీవితాలు చిత్తవుతాయని, చదువుపై దృష్టిపెట్టి క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. మత్తు పదార్థాలతో ఆరోగ్యం పాడవ్వడంతో పాటు కేసుల్లో ఇరుక్కుని జీవితం నాశనమవుతుందని వివరించారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా, తమ జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. చెడు అలవాట్లు, సహవాసాలకు దూరంగా ఉండి, విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టాలని, మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదిగేందుకు ప్రయత్నించాలని కోరారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా, ఉపాధ్యాయుల బోధనలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నార్కోటిక్స్ డీఎస్పీ ధర్మారెడ్డి, సీఐ గోపి, మోకిల సీఐ వీరబాబు, ఎస్సై కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మహిళలు హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి వెంకటేశ్వరమ్మ

వికారాబాద్, జూలై 31: ప్రతీ మహిళ తమ హక్కులు, చట్టాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి వెంకటేశ్వరమ్మ అన్నారు. బుధవారం సఖి కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలు, యువతులు ప్రభుత్వ పరంగా, రాజ్యాంగ బద్ధంగా తమకు ఏయే సదుపాయాలు, సౌకర్యాలు ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకుని సమాజంలో మార్పు తీసుకువచ్చే దిశగా ముందుకు సాగాలని సూచించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది వెంకటేష్ మాట్లాడుతూ.. గృహహింస, డీవీసీ-2005 యాక్ట్, వరకట్న హత్యలు, పోక్సో, ఎంసీ 125సీఆర్‌పీసీ తదితర అంశాల గురించి వివరించారు. సఖి సీఈవో యశోద మాట్లాడుతూ.. సఖి ఆధ్వర్యంలో ఐదు రకాల సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలింగ్, న్యాయ సేవలు, వైద్య సదుపాయం, వసతి సౌకర్యం, పోలీసుల సహకారం, వాహనసదుపాయం వంటి సేవలను సఖి అందిస్తోందని తెలిపారు. సహాయం అవసరమైన మహిళలు, యువతులు ఏ సమయంలోనైనా టోల్‌ఫ్రీ నంబర్ 181కు కాల్‌చేసి సహాయం పొందొచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఫైనాన్షియల్ లిటరసీ జెండర్ స్పెషలిస్ట్, అంగన్‌వాడీ, మెడికల్ విభాగాల బాధ్యులు, సఖి సిబ్బంది, రాజీవ్ గృహకల్ప మహిళలు పాల్గొన్నారు.



మునిసిపల్ సమావేశంలో చర్చిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

ఘట్‌కేసర్‌లో రూ.22లక్షల పనులకు తీర్మానం

చైర్‌పర్సన్, కమిషనర్ల ఒంటెత్తు పోకడలపై కౌన్సిలర్ నిరసన

ఘట్‌కేసర్, జూలై 31: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో వివిధ పనులకు రూ.22లక్షలు వెచ్చించాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. బుధవారం చైర్‌పర్సన్ పావనిజంగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరికరాలను కొనుగోలుకు తీర్మానించారు. పన్నుల వసూళ్లకు వినియోగించే యంత్రాలకు రూ.7లక్షలు, శానిటేషన్ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటుకు రూ.3లక్షలు, బయోమెట్రిక్ యంత్రాలకు రూ.2లక్షలు, శానిటేషన్ నిర్వహణకు రూ.8లక్షలు, మరి కొంత మొత్తం ఇతర ఖర్చులకు కేటాయిస్తూ తీర్మానం చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా చైర్‌పర్సన్ పావని, కమిషనర్ సాబెర్‌అలీ నిధుల కేటాయింపుల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని 12వ వార్డు కౌన్సిలర్ పద్మారావు ఆగ్రహం వ్యక్తం చేశాడు. సమస్యలపై ఎన్నిసార్లు వివరించినా తన వార్డుకు నిధులు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఎజెండా పత్రాలను టేబుల్‌పై విసిరి సమావేశం నుంచి వెళ్లిపోయారు. మురుగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతుంటే హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో వెంచర్ నిర్వాహకుడు చేయాల్సిన పనికి మున్సిపాలిటీ నిధులు ఎందుకు కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. ఎజెండా తయారీపై సభ్యులందరికీ ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ రుణాలివ్వాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): లక్ష్యాలకనుగుణంగా బ్యాంకర్లు అర్హులందరికీ రుణాలు ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేతి వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ పథకం కింద ఆర్థికసాయం అందించాలన్నారు. దరఖాస్తుదారులు ఆధార్, రేషన్ కార్డులు జత చేసి గ్రామ పంచాయతీలలో ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు కార్డు అందజేస్తారన్నారు. గుర్తింపు కార్డు పొందిన వారికి అవసరమైన ఉపకరణాలు పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా మొదటి విడతగా రూ.50వేలు, 2, 3వ విడతల్లో లక్ష, రెండు లక్షలు ఇస్తారన్నారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. మేడ్చల్ జిల్లాలో యువతకు ఉన్నత విద్యకు ఎక్కువ శాతం రుణాలు, రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్‌లు, వ్యవసాయ అనుబంధ రుణాలు ఇవ్వాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ , పరిశ్రమలు, డీఆర్‌డీఓ తదితర శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణ, తదితర రంగాలకు పేద లబ్దిదారులకు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో ఆర్బీఐ ఏజీఎం శ్రీలక్ష్మి, శ్రావ్య, కెనరా బ్యాంకు డీజీఎం, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, ఆర్బీఐ అధికారి పల్లవి, నాబార్డ్ డీడీఎం పి.అఖిల్, కృష్ణకాంత్‌రాయ్, జిఎండిఐసి రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, జిల్లా వ్యవసాయాధికారి మేరీ రేఖా, ఉద్యానవ అధికారి, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



మద్గుల్ చిట్టంపల్లిలో బోనాలతో మహిళల ప్రదక్షిణ

వికారాబాద్/తాండూరు రూరల్, జూలై 31: ఆషాఢ బోనాల సందర్భంగా వికారాబాద్‌లోని రామయ్యగూడ, మద్గుల్ చిట్టంపల్లి గ్రామాల్లో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. రామయ్యగూడలో పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించగా మద్గుల్ చిట్టంపల్లిలో గ్రామ దేవతకు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. వేడుకల్లో మద్గుల్ చిట్టంపల్లి కౌన్సిలర్ గోపాల్, రెండు కాలనీల పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. తాండూరు మండలం ఖాంజాపూర్‌లో బోనమ్మకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత, గ్రామస్థులు లాలప్ప, నర్సింహులు, అనంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, మహేందర్, శివకుమార్, వెంకటయ్య, మద్దూర్ వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఖాంజాపూర్‌లో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

ప్రతీ ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

దోమ, జూలై 31:ప్రతీ ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య అన్నారు. బుధవారం లింగన్‌పల్లి శివారులో నూతన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ పురోహితుడు శేషాద్రిరావు, గ్రామస్తులు గోపాల్, వెంకటయ్య, నర్సిములు, మొగులయ్య, రాములు, నాగని హన్మయ్య, ఆంజనేయులు, బుచ్చయ్య, వెంకటయ్య, విగ్రహ దాత నర్సిములు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

దౌల్తాబాద్, జూలై 31: మానవ అక్రమ రవాణా నేరమని దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ అన్నారు. బుధవారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గోకఫస్లాబాద్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు అపరిచితులు ఎవరినీ నమ్మరాదన్నారు. నమ్మించి బయటకు తీసుకెళ్లి మోసం చేసి వదిలిపెట్టడం కూడా అక్రమ రవాణానే అన్నారు. అబద్ధాలు చెప్పి పిల్లలను, మహిళలను, వ్యక్తులను అపహరించడం వంటివీ అక్రమ రవాణా కిందికే వస్తాయన్నారు. ఎక్కడైనా మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, మండల కో-ఆర్డినేటర్ వెంకటయ్య, హెచ్ఎం వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అదను చూసి అటవీ భూమి చదును

ధారూరు, జూలై 31: అటవీ అధికారులు బదిలీల కౌన్సిలింగ్‌లో ఉండగా మరో వైపు ఇదే అదునుగా అక్రమార్కులు ఎకరాల కొద్దీ అటవీ భూమిని చదును చేసి విత్తనాలు వేశారు. కొత్తగా బదిలీపై వచ్చిన అధికారులకు ఆక్రమణపై తెలిచకుండా చేస్తున్నారు. ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. ధారూరు అటవీ బీట్ బీముల ప్రాంతంలో 25హెక్టార్లలో మొక్కలు నాటారు. అటవీ శాఖ వివిధ రకాల మొక్కలు పెంచింది. గత నెలలో అటవీ శాఖ అధికారులకు బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు బిజీలో గడిపారు. ఇదే అదునుగా అక్రమార్కులు రాత్రి పూట మొక్కలు, చెట్లను నరికేసి చదును చేశారు. అటవీ భూమిలో విత్తనాలు వేశారు. పది ఎకరాల అటవీ భూమిలో మదనంతాపూర్, సంగాయపల్లి తండాల వారు ఆక్రమించినట్టు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. రేంజ్‌లోని రాస్నం, జుంటుపల్లి, కంకణాల పల్లి, సంగాయపల్లి తండాల్లోనూ పెద్దఎత్తున అడవిని ఆక్రమించి దున్నినా అటవీ శాఖ అధికారులు తొంగి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'మిట్టకోడూరు ఎఫ్ఏను సస్పెండ్ చేయాలి'

పరిగి, జూలై 31:ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడుతున్న మిట్టకోడూరు ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్యపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బుధవారం డీఆర్‌డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ నాయకులు రాజు, ఎల్లప్ప, రాంచంద్రయ్య, ప్రభు, మాణిక్యం, జావిద్, నర్సింహులు మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య తనకు అనుకూలంగా ఉన్నారని, పనులకు రాకుండానే మస్టర్‌లో పేర్లు రాయించి డబ్బులను కూలీలు, ఎఫ్ఏ చెరిసగం పంచుకుంటున్నారని తెలిపారు. వేలాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని, విచారణ జరిపించాలని అధికారిని కోరారు.

ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలి : ఎస్పీ

వికారాబాద్, జూలై 31: ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల బదిలీల్లో భాగంగా వారితో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ- ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేసి జిల్లా పోలీసుశాఖకు పేరు తీసుకురావాలన్నారు. ప్రజలకు తాముున్నామని భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏవో జ్యోతిర్మయి, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, బి-సెక్షన్ సూపరింటెండెంట్ మోహనప్ప, జిల్లాపోలీస్ ప్రెసిడెంట్ టీ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీని విలీనం చేస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న నాయకుడు సుదర్శన్

శామీర్‌పేట, జులై 31: దశాబ్దాల చరిత్ర కలిగిన శామీర్‌పేట పంచాయతీని తూంకుంట మున్సిపాలిటీలో విలీనం చేస్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని బీజేపీ జిల్లా నాయకుడు సుదర్శన్ హెచ్చరించారు. బుధవారం శామీర్‌పేటలో ఆయన మాట్లాడారు. శామీర్‌పేటను తూంకుంటలో విలీనంచేయడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందన్నారు. పంచాయతీకి 50ఏళ్ల చరిత్ర ఉందని, ఆ చరిత్రను ప్రభుత్వం తుడిచేయడానికి ప్రక్రియ ఆరంభించడం దారుణం అని ధ్వజమెత్తారు. దీన్ని శామీర్‌పేట ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. మండల కాంగ్రెస్ నాయకులు ఈ విషయంలో వెంటనే స్పందించి శామీర్‌పేట పంచాయతీ పరిరక్షణకు పాటుపడాలన్నారు. అవసరమైతే శామీర్‌పేటనే కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వంతో చర్చించాలన్నారు. పంచాయతీని తూంకుంటలో విలీనం చేస్తే ఎంపీ ఈటల రాజేందర్ నాయకత్వంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని సుదర్శన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రమేశ్, నాయకులు మురళి, పవన్, శివ పాల్గొన్నారు.

పోస్టల్ స్కీములు గ్రామీణులకు వరం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాకేష్

పూడూరు, జూలై 31: పోస్టాఫీసు పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒక వరమని తాండూరు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.రాకేష్ అన్నారు. బుధవారం తపాలాశాఖ ఆధ్వర్యంలో పరిగి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వివిధ తపాలా పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పి.రాకేష్ మాట్లాడుతూ పోస్టాఫీసులు ప్రజల అవసరానికి అనుగుణంగా డిజిటల్‌గా రూపాంతరం చెందాయని, వివిధ పొదుపు, బీమా పథకాలను అందిస్తున్నాయని తెలిపారు. గ్రూప్ యాక్సిడెంటల్ గార్డ్ పాలసీలు కేవలం రూ.520తో ఒక సంవత్సరానికి రూ.10లక్షల బీమా కవరేజీని ఇస్తోందని తెలిపారు. ఈ బీమా విద్యుత్ షాక్, పాముకాటుతోపాటు ఏదైనా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే ఈ బీమా ఉపయోకరంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యానికి పూర్తి బీమా వర్తిస్తుందన్నారు. లక్ష వరకు ట్రీట్‌మెంట్ చార్జీలు, మరణించిన పాలసీ దారుడి పిల్లలకు ఎడ్యుకేషన్ బెనిఫిట్స్‌తో పాటు ఇతర బెనిఫిట్స్ కూడా కవర్ అవుతాయని పేర్కొన్నారు. 18 నుంచి 65ఏళ్ల వయసు గల ప్రతీ వ్యక్తి జీఏజీ పాలసీలో చేరాలని, కుటుంబ సభ్యులకు భద్రతను నిర్ధారించాలని సూచించారు. పథకాల సమాచారానికి పోస్టాఫీసులను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని కోరారు. సమావేశంలో పరిగి మున్సిపల్ మేనేజర్ నరేష్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు రవీందర్, కృష్ణ, వెంకటేష్, ఎం.శేఖర్, పరిగి పోస్టుమాస్టర్ హరిత, రమేష్, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా నేతల అరెస్టు



కులకచర్లలో అరెస్టయిన బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్/కులకచర్ల, జూలై 31: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అడ్డుకోవాలని కోరుతూ రాష్ట్ర మహిళా మోర్చా బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపిచ్చింది. అయితే ఈ కార్యక్రమానికి వెళ్తున్న మేడ్చల్ మహిళా మోర్చా నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించా రు. మహిళా కానిస్టేబుళ్లు లేకుండా పురుష సిబ్బందే తమను ఇళ్ల వద్ద అరెస్టు చేసి తీసుకొచ్చారని నాయకురాళ్లు వాపోయారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు హేమలతారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షురాలు కృష్ణప్రియ ఉన్నారు. కులకచర్లలో పోలీసులు బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా నాయకులు సౌమ్యారెడ్డి, మైపాల్, చంద్రలింగం, సంతుగౌడ్ తదితరులను అరెస్టు చేసి అనంతరం సొంత పూచీ కత్తుపై విడుదల చేశారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఉద్యోగ విరమణ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

మోమిన్‌పేట్, జూలై 31: సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని వికారాబాద్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం మోమిన్‌పేట్‌లోని ఏజేఆర్ ఫంక్షన్ హాల్లో చీలమదరి పాఠశాల హెచ్ఎం వరాల పురుషోత్తం ఉద్యోగ విరమణ సభకు ఆమె హాజరై మాట్లాడారు. ఉద్యోగులు చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయన్నారు. పురుషోత్తంను సునీతారెడ్డి, షాబాద్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో స్నేహితులు పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జనార్ధన్, టీచర్లు చంద్రశేఖర్, అమర్‌నాథ్, ప్రభు, హరిలాల్, మల్లేశం, గౌరీశంకర్, మల్లేశం, నాగేశ్వర్, అరుణ్‌కుమార్, మాణిక్యం, రమేశ్, రవికుమార్, రిటైర్డ్ టీచర్ యాదగిరిచారి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు యాదగిరి, ఈశ్వర్ కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: బాధ్యతగా పనిచేసిన ఉద్యోగులకు చిరస్థాయి గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగి బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ బి.చంద్రకళఆంజనేయులు రిటైర్మెంట్ కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి మందిరంలో నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే హాజరై సన్మానించారు. మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ప్యాక్స్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైఎస్‌చైర్మన్ ఎస్.భాస్కర్, నాయకులు ఆర్.ఆంజనేయులు, సురేందర్, బి.హరిప్రియ, అరవింద్‌రావు, కె.రాజిరెడ్డి, జి.మల్లేశం, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ఉపేందర్, భీంరాజు, టీచర్లు రామాంజనేయులు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: పెద్దేముల్ తండా పాఠశాల ఉపాధ్యాయుడు సంగప్ప రిటైర్మెంట్ కార్యక్రమాన్ని పెద్దేముల్‌లోని బాలుర పాఠశాలలో నిర్వహించారు. పీఆర్టీయూ నేతలు, ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్య, టీచర్లు రాజశేఖర్, నవీన్‌కుమార్, నరేందర్‌రెడ్డి, సునీత, నర్సింగ్‌రావు, భోజప్ప, అక్కమహాదేవి, అన్నపూర్ణ, నర్సిరెడ్డి, గోబ్ర్యానాయక్, రవికాంత్‌రెడ్డి, బంద్యప్ప, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్/కొడంగల్: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసిన రాములు రిటైర్మెంట్ సందర్భంగా అధికారులు, సిబ్బంది రాములు దంపతులను సన్మానించారు. కేఎస్‌వీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు రాములను సన్మానించారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేసిన మల్లారెడ్డి రిటైర్మెంట్ సందర్భంగా డీఈ భానుప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో కొడంగల్ ఏడీఈ నవీన్‌కుమార్, ఏఈ నాగరాజు పాల్గొన్నారు.



పరిగి: వార్డెన్ చంద్రకళ దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వైద్యమందక మేక మృతి

● మేక కళేబరాన్ని వైద్యశాల బోర్డుకు వేలాడదీసి రైతు నిరసన



పశు వైద్యశాలకు వేలాడదీసిన మేక కళేబరం

ధారూరు, జూలై 31: వైద్యం కోసం పశువైద్యశాలకు తెచ్చిన మేకకు సిబ్బంది లేక వైద్యమందలేదు. రైతు మేకను ఇంటికి తీసికెళ్లిన తర్వాత మృతిచెందింది. దీంతో ఆగ్రహం, ఆవేదనతో రైతు మేక కళేబరాన్ని పశు వైద్యశాల బోర్డుకు వేలాదిశాడు. ఈ సంఘటన మండల పరిధి నాగారంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ విషయం సామాజిక మాధ్యమల్లో వైరల్ కావటంతో వైద్యాధికారులు గోపాలమిత్రను పంపించి చేతులు దులుపుకున్నారని రైతులు మండిపడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. దశరథ్ అనారోగ్యంతో ఉన్న తన మేకను నాగారం వెటర్నిరీ ఆస్పత్రికి తెచ్చాడు. అక్కడ పశువైద్య సిబ్బంది లేరు. వైద్యశాల మూసి ఉంది.వారి కోసం వేచిచూసిన దశరథం సిబ్బంది రాకపోవటంతో మేకను ఇంటికి తీసుకుపోయాడు. ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికి మేక మృతిచెందింది. దీంతో దశరథం ఆగ్రహంతో చనిపోయిన మేకను తెచ్చి పశువైద్యశాల బోర్డుకు వేలాడదీసి వెళ్లిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న పశుసంవర్ధక శాఖ అధికారులు తరిగోపుల గోపాలమిత్ర యాదయ్యను పంపించి పశువైద్యశాలను తెరిపించి పశువులకు వైద్యం చేయించారు. వేలాదీసిన మేకను తీసేయించారు. పశువైద్యశాల సిబ్బంది సక్రమంగా పనిచేయరని, ఎప్పుడూ తాళమే ఉంటుందని, వైద్యం అందక పశువులు చనిపోతున్నాయని రైతులు ఆరోపించారు. మేకకు వైద్యం అందక రూ.6 వేల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

కార్యాలయంలో నిలిచిన సర్టిఫికెట్ల జారీ

● రెండు ఆర్ఐ పోస్టులు ఖాళీ

తాండూరు రూరల్, జూలై 31: తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో రెండు ఆర్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పది రోజుల క్రితం కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ రాజిరెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా, మరో ఆర్ఐ బాల్‌రాజ్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. దీంతో ఉన్న ఇద్దరు ఆర్ఐలు బదిలీ కావడంతో తహసీల్దార్ కార్యాలయంలో పలు సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయింది. వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. కులం, ఆదాయం, కల్యాణలక్ష్మి విచారణతోపాటు పలు సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయింది. పదిరోజుల క్రితం బదిలీ అయిన ఆర్ఐ స్థానంలో ఇప్పటి వరకు కొత్తగా ఎవరూ రిపోర్టు చేయలేదు. ఈ విషయమై తహసీల్దార్ తారాసింగ్‌ను వివరణ కోరగా, ఇద్దరు ఆర్ఐతోపాటు సర్వేయర్ బదిలీపై వెళ్లినట్లు చెప్పారు. సర్వేయర్ శ్రీహరి బదిలీ అయినా ఇంకా ఆయన ఆర్డర్లు రాలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు తాండూరు మండలానికి ఇద్దరు ఆర్ఐలను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 31: కొర్రెముల శోభమని ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నారపల్లి, చౌదరిగూడ ప్రభుత్వ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వనం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి నాగమల్లు, ముచ్చెర్ల లక్ష్మి, ప్రధానకార్యదర్శి రాళ్లబండి కిరణ్‌కుమార్, సహాయ కార్యదర్శులు దొడ్డి రవి, శివనారాయణ, కోశాధికారి తొంట కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు నోముల రాముల, భాగ్యలక్ష్మి, సలహదారులుగా తొంట సత్యనారాయణ, పాలడుగు రవీందర్‌రెడ్డి, తిర్మల్‌రెడ్డి, భానుప్రసాద్, శ్రవన్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

'సమాజాన్ని కుటుంబంలా భావించాలి'

మూడుచింతలపల్లి, జూలై 31: ప్రతీ ఒక్కరు సమాజాన్ని కుటుంబంలా భావించినప్పుడే సమ సమాజస్థాపన సాధ్యం అని మూడుచింతలపల్లి మాజీ సర్పంచ్ జాము రవి అన్నారు. బుధవారం మూడుచింతలపల్లిలో పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలు ప్రతీ ఒక్కరికి సమానమే అన్నారు. యువత ఉన్నత విద్య అభ్యసించాలని, అప్పుడే వారికి మంచి చెడులు తెలుస్తాయని, హక్కులను ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుస్తుందన్నారు. తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా కులం పేరుతో దూసిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వత్సలాదేవి, ఎంపీవో మంగతయారు, డీటీ నాగజ్యోతి, ఆర్ఐ రాఘవ, పంచాయితీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, నర్సింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: కులరహితంగా సమాన భావంతో కలసి మెలగాలని తహసీల్దార్ యాదగిరిరెడ్డి అన్నారు. మజీద్‌పూర్‌లో మానవ హక్కుల దినోత్సవాన్ని(సివిల్ రైట్స్ డే) నిర్వహించారు. ఎస్సీలను ఎవరూ చిన్నచూపు చూడొద్దని, కుల రహితంగా కలసి మెలసి ఉండాలని అన్నారు. ఎంపీడీవో మమతాబాయి, దళిత సే న రాష్ట్ర నాయకుడు తుంకి మల్లేశ్ మాట్లాడుతూ సంఘంలో ఎవరూ కులాల ప్రస్తావన తేకూడదని, కులరహితంగా పనులు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పార్టీల నాయకులు, దళిత సేన నాయకులు, ఏఎస్సై పాల్గొన్నారు.

సామర్థ్యాలు పెంచేలా విద్యాబోధన జరగాలి

పెద్దేముల్, జూలై 31: విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచేలా తరగతిలో విద్యాబోధన జరగాలని ఎంఈవో వెంకటయ్య అన్నారు. పెద్దేముల్‌లోని జడ్పీ బాలుర పాఠశాలలో రెండురోజుల పాటు జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశంలో మండల ఆయన ప్రసంగించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో మంచి ఫలితాలు సాధించేలా టీచర్లు విద్యాబోధన చేయాలని కోరారు. నేర్చుకున్న మెలకువలు, సామర్థ్యాలు పిల్లల్లో రాబట్టే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, కాంప్లెక్స్ హెచ్ఎంలు సునీత, భోజప్ప, ఆర్పీలు బంద్యప్ప, నర్సిరెడ్డి, రమేష్, ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కూల్చివేస్తున్న అక్రమ నిర్మాణాలు

కీసర రూరల్, జూలై 31: ప్రభుత్వ స్థల కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం అహ్మద్‌గూడ సర్వే నంబర్ 74లోని ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల కబ్జా చేస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషోర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం'

దోమ, జూలై 31: ముదిరాజ్‌లను గుర్తించి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి చైర్మన్‌గా బుర్ర జ్ఞానేశ్వర్‌ను నియమించడం హర్షణీయం అని ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి చందు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మార్చాలని కోరారు.

'సామాన్యులను వంచించే బడ్జెట్'

కొడంగల్, జూలై 31: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులను, సామాన్యులను వంచించేలా ఉందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సురేశ్‌కుమార్ అన్నారు. బుధవారం కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర బడ్జెట్ జీవో కాపీని దహనం చేశారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై కక్ష పూరితంగా వ్యవహరించి విభజన హామీలను ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. పాలమూర్, రంగారెడ్డితో పాటు ఏ ఒక్క ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. రాష్ట్రం నుంచి గెల్చిన 8మంది బీజేపీ ఎంపీలు కేంద్రంపై వత్తిడి తెచ్చి రాష్ట్రానికి నిధులు తేవాలన్నారు. కార్యక్రమంలో బాబ్యానాయక్, రుద్రారం వెంకటేశ్, తులసిరామ్, పెంటప్ప, వెంకటప్ప, రైతులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో తప్పులను సరిచేయాలి

కులకచర్ల, జూలై 31: ఓటరు లిస్టులో తప్పులను సరిచేయాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు జెమినీ సురేశ్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌ను కలిశారు. గ్రామాల ఓటరు లిస్టుల్లో పొరపాట్లు ఉన్నాయన్నారు. బీఎల్వోల పొరపాట్లతో ఒకే ఇంటికి చెందిన ఓట్లు వేర్వేరు వార్డుల్లో ఉన్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే వారు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. లిస్టులను సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో కులకచర్ల మాజీ సర్పంచ్ జానకిరామ్, నాయకులు మహిపాల్, ఆంజనేయులు, సంతోష్‌గౌడ్, అంజిలయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కులకచర్ల, జూలై 31: ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. బుధవారం తిరుమలాపూర్‌లో పౌర హక్కులపై సమావేశం నిర్వహించారు. ప్రజలంతా సోదర భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్యశీలారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డెన్ రాజు, కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓడీఎఫ్‌పై మైల్వార్‌లో గ్రామ సభ

బషీరాబాద్, జూలై 31: మైల్వార్ పంచాయతీలో ఓడీఎఫ్ ప్లస్‌పై బుధవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ వై.వెంకటేష్ నేతృత్వంలో గ్రామాభివృద్ధిపై సమీక్షించారు. ఓడీఎఫ్ ప్లస్ కార్యక్రమంపై చర్చించి తీర్మానాలు చేశారు. చెత్తాచెదారం, మురుగునీటి నిల్వలు, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా తగిన చర్యలు చేపట్టామని కార్యదర్శి నర్సింహగౌడ్ వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద సోంపల్లి బిచ్చిరెడ్డి, స్థానిక ప్రజలు పలువురు పాల్గొన్నారు.

మండల వైద్యాధికారిగా సౌందర్యలత



కీసర, జూలై31: మండల వైద్యాధికారిగా సౌందర్యలత బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా కీసర మండల వైద్యాధికారిగా సేవలందించిన సరిత నగరంలోని టీబీ కేంద్రానికి బదిలీ అయ్యారు. ఉప్పల్ వైద్యాధికారిగా పని చేసిన సౌందర్యలత కీసర మండల వైద్యాధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

శామీర్‌పేట, జులై 31 : తాను మండల పరిషత్‌లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొత్త మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) వినూత్న అన్నారు. మేడ్చల్ ఎంపీఓగా పనిచేసిన వినూత్న బదిలీపై శామీర్‌పేటకు వచ్చారు. బుధవారం మండల పరిషత్‌లో చార్జి తీసుకున్నారు. వినూత్న మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది బాధ్యతగా విధులను నిర్వర్తించేలా చర్యలను తీసుకుంటానని చెప్పారు. ప్రభుత్వ పనులను సక్రమంగా అమలయ్యేలా చర్యలను తీసుకుంటానని చెప్పారు. పంచాయతీ అధికారుల, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తానని ఎంపీఓ చెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పర్యటిస్తున్న ఉమాహారతి

పెద్దేముల్, జూలై 31: ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి బుధవారం మండలంలో పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ధరణి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలించారు. తహసీల్దార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బుద్ధారంలో పర్యటించారు. కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న మహిళతో మాట్లాడి పంచనమా రిపోర్టును నమోదు చేశారు. గ్రామంలో తిరిగి పారిశుధ్యాన్ని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. పాఠశాల టీచర్లతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, ఆపరేటర్ బసంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, లాలప్ప పాల్గొన్నారు. కాగా గ్రామంలో బండలతో పైకప్పు కప్పిన ఇళ్లను చూసి ట్రైనీ కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బండలు పడిపోవా? అని అడుగగా వాటికింద కర్రలు ఏర్పాటు చేస్తారని కార్యదర్శి చెప్పారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో ఐదుగురి రిమాండ్

మూడుచింతలపల్లి, జూలై 31: హత్యాయత్నం కేసులో ఐదుగురిని శామీర్‌పేట్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీనాథ్ తెలిపిన కథనం ప్రకారం.. అద్రాస్‌పల్లిలో ఆదివారం రాత్రి ఇరువర్గాలు కత్తులతో దాడి చేసుకున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదుతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరుచగా కోర్టు రిమాండ్‌కు తరలించాలని ఆదేశించినట్టు సీఐ చెప్పారు. కత్తులతో దాడి చేసుకున్న జీడి నర్సింహ, జీడి మల్లేష్, జీడి జనార్ధన్, జూపల్లి నాగరాజు, రాత్రే అర్జున్‌లను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ప్లాట్ల అమ్మకం పేరుతో మోసం.. వ్యక్తి అరెస్ట్

హైదర్‌నగర్, జులై 31: రియల్ వెంచర్‌లోని ప్లాట్లు కొంటే లాభాలు వస్తాయని నమ్మించి మోసగించిన వ్యక్తిని నగరంలోని కేపీహెచ్‌బీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ వేంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో నివసించే అరిమంద సుజాత, వివేకానందనగర్‌లో నివసించే పోచారెడ్డి సరిత అనే ఇద్దరు స్నేహితులు. వీరికి ప్రొద్దుటూరుకు చెందిన గిద్దలూరు నాగేంద్ర ఆచారి(32) పరిచయమయ్యాడు. తాను షణ్ముఖ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ ప్రతినిధినని, తమ సంస్థకు వికారాబాద్ జిల్లా ఎల్లకొండలో సర్వే నంబర్ 307 నుంచి 313 వరకు ఉన్న భూమిలో ప్లాట్లు విక్రయిస్తున్నామని తెలిపాడు. తక్కువ ధరకే ప్లాట్లు అమ్ముతున్నామన్నాడు. అతడిని నమ్మి ప్లాట్లకు సుజాత రూ.23.95 లక్షలు, సరిత రూ.11.70లక్షలు చెల్లించారు. 2022 ఫిబ్రవరిలో సేల్ అగ్రిమెంట్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయమని నాగేంద్రాచారిని అడిగారు. అతడు తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో మహిళలు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం నాగేంద్రఆచారిని హైటెక్ సిటీలో అరెస్ట్ చేసి రేమండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వరరావు వివరించారు.

సంక్షిప్తంగా...

● **యలాల:** గ్రామ పానాది బాటను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ మండలంలోని దేవనూర్‌కు చెందిన రైతులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన చైతన్య కృష్ణ దేవనూర్‌లో 25ఎకరాల భూమి కొన్నాడన్నారు. అతడు గ్రామానికి చెందిన పానాది బాటను ఆక్రమించుకున్నాడని ఆశన్న, కాశీం, మొగులప్పప, రాంచంద్రు తెలిపారు. దీంతో తాము పొలాలకు వెళ్లేందుకు తోవ్వ లేకుండా అయిందన్నారు. అధికారులు పానాది యాథావిధిగా విధంగా చూడాలని రైతులు కోరారు.

● **బషీరాబాద్:** బషీరాబాద్‌లో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి తాండూరు చెందిన కాసులబాల్‌రాజ్, ఎం.నర్సింహులు రూ.18వేల విరాళాన్ని అందజేశారు. బషీరాబాద్‌లో ఆయల కమిటీ అధ్యక్షుడు సాయిల్‌గౌడ్‌కు నగదును అందజేశారు. కమిటీ నిర్వాహకులు వడ్డే శ్రీనివాస్, ఉల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

● **కీసర రూరల్:** నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పురపాలక శాఖ పరిపాలన అధికారిని(సీడీఎంఏ కమిషనర్) కలిశారు. మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి రుసుము మూడు సంవత్సరాలుగా మున్సిపల్ ఖాతాలో జమ కావడం లేదని అధికారికి తెలిపారు. దాదాపు రూ.90లక్షల మేర నిధులు నిలిచిపోయాయని, వాటిని విడుదల చేస్తే అభివృద్ధి పనులకు వెచ్చిస్తామని విన్నవించారు.

● **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ పరిధిలో శానిటేషన్ అధికారులు, సిబ్బంది ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా పారిశుధ్య పనులను సక్రమంగా చేయాలని కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధికారులు, సిబ్బందితో పారిశుధ్యం, వనమహోత్సవం పనులపై సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా మున్సిపల్ పరిధిలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఖాళీ స్థలాల్లో, ఇళ్ల పరిసరాల్లో ప్రజలు బాధ్యతగా మొక్కలను నాటేలా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ మున్సిపల్ పరిధి 8వ, వార్డు అభివృద్ధికి 33లక్షల కేటాయించామని మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక అన్నారు. 8వ, వార్డులో రూ.10లక్షలతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 23లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ ప్రారంభించారు. రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయించి ప్రతి వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చాప రాజు, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** శాంతి భద్రతల రక్షణే పోలీసుల లక్ష్యమని ఎస్ఐ రమేష్‌కుమార్ అన్నారు. బషీరాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్‌క్రైం, బాల్య వివాహాలు, రక్షణాత్మక డ్రైవింగ్, మూఢ నమ్మకాలు, డ్రంకెన్ డ్రైవ్ అంశాలపై కళాజాత బృందంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆకతాయిలు భయందోళనకు గురిచేసినా, వేధించినా వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాల జరిగితే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అల్తామాస్ జహంగీర్, టీచర్లు పాల్గొన్నారు.

● **పూడూరు:** ప్రతి ఒక్కరూ ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలని చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి అన్నారు. మోడల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు డయల్ 100, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైం వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు 18ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది జమీల్, అనిల్, లక్ష్మి పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** శారీరక వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు నిర్వహించిన సదరం శిబిరానికి విశేష స్పందన లభించింది. తాండూరులోని జిల్లా ఆసుపత్రి పీపీ యూనిట్‌లో క్యాంప్ ఇన్‌చార్జి శ్రీధర్ ఆధ్వర్యంలో సదరం క్యాంప్‌ను నిర్వహించారు. క్యాంపులో వైద్య పరీక్షలకు శారీరక వికలాంగులు వారు 80మంది స్లాట్ బుక్ చేసుకోగా, 46మంది హాజరయ్యారు. డాక్టర్లు కల్యాణి, రిజ్వానా వైద్య పరీక్షలు నిర్వహించారు. వికలాంకుల ప్రతినిధి వెంకటేశ్ వికలాంగులకు దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించారు. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, తాండూరు, బషీరాబాద్ మండల గ్రామాల వారు హాజరయ్యారని నిర్వహకులు తెలిపారు.